పెళ్లానికి చెప్పలేదు. తనూ మర్చిపోయివచ్చి పరుపుక్రింద పైజమ్మా చూసి పెళ్లాన్ని అనుమానించి నానారభస చేశాడు. "ఇలాటి మొగుడితో మాలలిత ఏం సుఖపడుతుంది?" అన్నాన్నేను.

మావారు అదోలా నవ్వి "లలిత చాలా సుఖపడుతుంది. నీకు తెలీదు, మీ రచయిత్రులిక్కడే డాల్‌లో స్టెప్ వేస్తూవుంటారు" అన్నారు.

"వ్హాట్‌స్సార్ వ్హాట్" అన్నాన్నేను వెక్కిరింతగా.

"లలిత యిప్పుడు పరిగెత్తుకెళ్ళింది మొగుడిమీద మైకంతో కాదు. చిక్కక చిక్కక మిడతంభొట్లు చేతిలో చిక్కాడు - ఇక వాడు ఆ గున్న ఏనుగు మీ లలిత చేతిలో ఆజన్మ ఖైదీయే - చూస్తూ వుండు -వాడ్ని ఓ ఆట ఆడిస్తుంది. ఈ మాత్రం తెలుసుకోలేకపోయావ్" అన్నారు.

"అవును. మీరు చెప్పింది నిజవే. మొన్న లలిత టాక్సీలో వచ్చినపుడు దాని మెళ్లో నాలుగుపేటల చంద్రహారం వుంది. నెక్లెస్ మార్చింది. రవ్వల ముక్కుపుడక కొంది. దాని మొగుడు దాన్నిప్పుడు క్రిందకు దింపడు. టాక్సీలోనేపోతూ ఆ పూర్నించీ వూరికి భుజాలమీద కూర్చోపెట్టుకుని ఎగురుకుంటూ వస్తాడు. మమ్మల్ని సినిమాకు కూడా తీసుకెళ్ళింది. దాని మొగుడిప్పుడు దాని చెప్పుక్రింద తేలు."

# వీపుమీద విమానం

వీప్మీద విమానమేవిటని తెల్లబోతున్నారా చెప్తా-చెప్తా-మీచంటాడో చంటిదో విమానం కోసం ఏడిచి అల్లరి చేసినపుడు మీరో విమానం ఆటని వెంటనే ఆలోచించాలి కదా. అప్పుడు మీ వారిని హాల్లో చాపమీద బోర్లా నాలుగు పాదాల మీదా పారాడే కృష్ణుడి బొమ్మలా పడుకోమనాలి. ఒకవేళ పడుకునుంటే కాస్సేపు పారాడే కృష్ణుడిలా వుండమనండి. అప్పుడు మీ బాబ్జీగాడిని మీరెత్తుకొచ్చి మీవారి వీపుమీద పడుకోబెట్టి వాడు చేతుల్ని చాపినపుడల్లా మీవారు నోటితో "బొంయ్ బొంయ్ బొంయ్" మని ఇంజన్ బయల్దేరిన చప్పుడు చేస్తూ గదిలో యిటూ అటూ గుండ్రంగానూ అడ్డంగానూ, నిలువుగానూ తిరగాలి. మీ బాబ్జీ క్రింద పడిపోకుండా కాళ్ళతో కప్పలా మీవారి నడుంచుట్టూ వాటేసుకుని పట్టుకోవాలి. ఈ ఆట మీరు ఆడిస్తూంటే మీవారు నోటితో విమానం చేసే చప్పుళ్ళన్నీ చేస్తూ వుంటారు. అప్పుడు మీరు గుమ్మం దగ్గిర నిలబడి అలవోకగా నవ్వుతూ ఆనందించాలి. ఈ ఆట విజయం అంతా మీరు మీవారిని పారాడే కృష్ణుడి బొమ్మలా చాపమీద పడుకునేలా చేయటంలో వుంది కిటుకు. చల్ చల్ గుర్రం ఆటని కొంచెం మారిస్తే వీపు మీద విమానం ఆట వస్తుంది. మీవారు కాస్త ఏమరుపాటుగా వుంటే మీ బాబ్జీ వీపు మీదెక్కి విమానం ఆట ఆడుకుందాం రమ్మని మీ వారిని చంపుకు తింటాడు. మీ వారికి మిమ్మల్ని చూసినా బాబ్జీని చూసినా లోపల నుంచి

గుండెదడ బయల్దేరుతుంది. అసలు చాపమీద పడుకోరు పడుకున్నా వెల్లకిలా తప్ప బోర్లా అసలే పడుకోరు. ఈ విమానం ఆట ఎక్కడ మొదలవుతుందోనని బెంగ పెట్టుకుని చక్కగా భాసింపట్టు వేసుగుని కూర్చుంటాడు. ఒకవేళ విస్కుంటే చిన్న పిల్లాడు దగ్గరికొస్తే విసుక్కుంటా రేవిటి అని మీరే అతని నోట్లో గడ్డి పెట్టొచ్చు.

మీవారెప్పుడూ కుర్చీమీదా, మంచం మీదా కూర్చుని కాళ్ళూపుతారనుకోండి. అప్పుడు మీ బాబ్జీని పిల్చి వెళ్లి నువ్వూ నాన్నగారూ వుయ్యాల ఆట ఆడుకోండమ్మా అని మీరు పిల్లడిని పురుషుడి మీదకు వుసిగొలిపి చక్కగా పిండి విసురు కుంటూనో చేటలో పప్పులు పోసుకుని చెరుగు కుంటోనో ఆ గదికీ ఈ గదికీ మధ్య గుమ్మంలో కూర్చుని జరిగే తమాషాని గమ్మత్తుగా క్రీగంట గమనించండి. "వీడేవిటే వుయ్యాల ఆట అంటాడూ" అని మీవారు యిబ్బందిగా మొహం పెట్టి అడుగుతారు. మీరు మాట్లాడకుండా వినపడనట్లు వూరుకోండి. మీబాబ్జీ బంకలా పట్టుకుని వదలడు "మన ఇంట్లో వుయ్యాల లేదమ్మా" అని వారు గుంటడిని బుజ్జగిస్తూ వుంటారు వాడు గీమని అరిచి గొడవచేశాక కాస్సేపు కాళ్ళమీద కూర్చోపెట్టుకుని ఆడించండి అని మీరు యధాలాపంగా అన్నట్లు అనేసి "వెళ్ళమ్మా నాన్నగారు కాళ్ళమీద కూర్చోపెట్టుకుని వూపుతారు" అని మీ వాడికి నచ్చచెబుతున్నట్లు చెప్పండి. మీ బాబ్జీ వెళ్ళి మీవారి పాదాల మీద కూర్చుని గట్టిగా మోకాళ్ళను కరుచుకుంటాడు. అప్పుడు మీవారు కాస్సేపు కాళ్ళను వూపుతూ పళ్ళు గట్టిగా కరుచుకోవడం ఆరంభిస్తారు. బాబ్జీ మళ్ళీ వూపు మళ్ళీ వూపు అంటూ మీవారిని విడిచి పెట్టడు. పురుషపుంగవుడికికాళ్ళు లాక్కు వస్తున్నా బాబ్జీ దిగడంటే దిగడు. ఈ ఆట ఒక పావుగంట ఇరవై నిముషాలయే సరికి మీవారు "కాఫీ" అని అరవకపోతే ఒట్టు. మీవారికి ప్రాణ సంకటంగా తయారయినప్పటికీ మీకు చాలా ఎంటర్‌టెయినింగుగా వుంటుంది. ఒక వేళ వెల్లకిలా పడుకుందామని ఆ మానవుడు ఎక్కడైనా వెల్లకిల పడినా మీ బాబ్జీ వెళ్ళి కాళ్ళకు కప్పల్లా కరుచుకుని వుయ్యాలాట ఆడించమని పీక్కు తింటాడు. కొన్నాళ్ళదాకా ఈ ఆట పేరు చెపితే మీవారికి కాళ్ళు పీకుతాయి. బాబ్జీని చూడగానే వాడు మీద పడటానికి లేకుండా ఠక్కున పోలీసు జవానులా లేచి నిలబడతారు మీ వారు ఎక్కడున్నా సరే. ఇలా మీవారు నిలబడిపోయి ఇంట్లో తిరుగుతున్నప్పుడు అతగాడిని హడల కొట్టడానికి మరో చిన్న ఆట వుంది.

మీ హాల్లోగాని సావిట్లోగాని మీ బాబ్జీని రెండు రెక్కలూ పుచ్చుగుని గుండ్రంగా తిప్పి ఆడించమనండి. మీవారు రెండు మూడు నిమిషాలు గుండ్రంగా తిరిగేసరికి తిరిగి "అమ్మో! అయ్యో?" అంటూ తల పట్టుకుని కళ్లుమూసుగుని కూలబడతారు. లేవండి ఓవల్టీన్ పుచ్చుగోండీ అన్నా ఇప్పుడొద్దే అని చేత్తోనే వారిస్తారు. మీరు జాలిపడ్డారా కొంపమునుగుతుంది.

ఈ ఆటల వలన లాభమేమిటి అని అడక్కండి. మీ గృహలక్ష్మి పతి యింట్లో మీ కంటి ముందు పిల్లల్ని ఆడిస్తూ చరణదాసుడిలాగపడి వుండటం కంటె మీరు కోరుకోదగిన ఆనందం ఏవిటి? మీరన్నా మీ పిల్లలన్నా మీ వారికి భయమూ భక్తీ ఏర్పడటానికింత కంటె సులువైన

మార్గం కనిపించటం లేదు మీ వారు సైకిల్మీద చెప్పకుండా మార్నింగ్ షోలకి గట్రా వుడాయించే సరుకైతే మీ బాబ్జీకి సైకిల్ గాలి ఎలా వూడతీయాలో చెప్పండి. మీరు హస్తలాఘవం కలవారైతే పర్సులోంచి నోట్లన్నీ తీసి సుబ్బరంగా చీటీ కట్టేయండి. జేబులు కొట్టేయడం నేర్చిన ఆడవాళ్ళు అవే మొత్తాల్ని అవే మొగుళ్ళకు చక్రవడ్డీకి తిప్పి నెక్లెసులూ రవ్వల దుద్దులూ చేయించుకున్న వాళ్ళని నేనెరుగుదును. స్త్రీ సర్వశక్తి స్వరూపిణికదా - ఆమె తల్చుగుంటే చేయలేనిదంటూ వుండదు. కాని తల్చుగోదు.

మీ యింట్లో అటకగాని వుంటే మీకు చాలా లాభం. అందులో మీవారి కుపయోగించే వస్తువులు కొన్నిటిని భద్రం చేయండి. అప్పుడప్పుడు మీ వారిని అటక ఎక్కిస్తూ వుండండి. ఒకవేళ అటక లేకపోతే స్టోర్రూం వుంటుంది గదా - అందులో మినిమం ఒక అరపూట లేదా ఏడెనిమిది గంటలు గడిపేలా వారికి హోంవర్క్ యివ్వండి. హోం వర్క్ లేకపోతే స్కూలు పిల్లలు చెడిపోయినట్లుగానే మగవాళ్ళూ చెడిపోతారు.

ఇవి స్కూళ్ళు తెరిచేసిన రోజులుకదా. ఇరుగు పొరుగు పిల్లలకి మోయలేనన్ని పుస్తకాలు వాళ్ళ వాళ్ళు కొంటారు కదా! మీ వారికి అట్టలు బాగా వేయటం వచ్చని చెప్పండి. ఇహ చూసుకోండి తమాషా. చుట్ట ప్రక్కల పిల్లలంతా చేరి మీ వారిని పుస్తకాలకు అట్టలు వేసిపెట్టమని వచ్చి కూర్చుంటారు. అప్పుడా మానవుడు చాపకి అంటుకుపోతాడు. పిల్లలు చుట్టూచేరి కదలనివ్వరు. అతగాడు విసుక్కుంటే పరోపకారం అంటే వూర్లోంచి పారిపోయే రకం అని మీరు తిరగబడండి. తగ్గుతాడు. తగ్గక తప్పదు. మీరెప్పుడూ ఎగస్పార్టీలో జేరిపోతూంటే మీ అనుగ్రహం సంపాదించేందుకై అతను ఎన్నిపాట్లయినా పడ్తాడు. దెబ్బలాట ఎప్పుడూ సాయంత్రం పెట్టుకోవాలి, సూర్యుడు అస్తమించే టైం కదా!

లేకపోతే అతని స్నేహితులు మీ యింటికొచ్చినపుడు మీరు ముక్కిపోయిన గోధుమ రవ్వతో ఉప్మాచేసి పెడతారేమోననే భయం అతనికి వుండనే వుంటుంది. భర్తలను లొంగదీసుకొనటానికి పిల్లలను ఆటంబాంబుల్లా వుపయోగించుకోవాలి. వీపుమీద విమానం ఆట గురించి కాని, కాళ్ళమీద వుయ్యాలాట - గుండ్రంగా పిల్లడిని తిప్పటం గురించికాని అతనుపడే బాధ ఎవరితో చెప్పుకోలేడు. ఇది తగుమాత్రం హింసే నిజంగా గెస్టులను తీసుకొచ్చి, పీకమీద కూర్చోబెట్టి, వేళాపాళా లేకుండా యింటికొచ్చి సినిమాలకు షాపింగులకు మీతో వస్తానని చెప్పి ఎగ్గొట్టి అతను మిమ్మల్ని హింసించినందుకుగాను యిది టిట్ఫర్ టాట్! ఇవన్నీ ఒక్కమారే ప్రయోగించకండి. అతను బెదిరిపోయి సన్యాసుల్లో కలిసి పోవచ్చు. అయితే ఇందులో మీ పాత్ర చాలా నిమిత్తమాత్రంగా వుండాలి. మీరు "ఇహ్హిహీ" అంటూ నవ్వటం ప్రారంభిస్తే మీ నెత్తిమీద మొట్టి కాయలు పడవచ్చు. మీరు పెళ్ళికూతుర్లా తలకాయ వంచుకుని మీ బుర్రలోని ఆలోచనలన్నీ ఒక్కొటొక్కటే అమల్లో పెట్టాలి. దీనికేమీ తెలీదు, యిది బిగ్యాస్ అనుకుంటూనే అతను గోతుల్లో పడుతూ వుంటాడు. మీ ప్రోగ్రాం వీపుమీద విమానంతో ప్రారంభించం. ఇంతకీ మీ యింట్లో పారాడే కృష్ణుడి బొమ్మ వుందా లేదా?